క్లుప్తంగా

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహా గణపతి పూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పుష్పార్చన, శతనామావళి, ఆకుపూజతో పాటు మహా మంగళహారతులు చేపట్టారు. అనంతరం తొగట వీరక్షత్రీయ కుల బాంధవులతో పాటు గ్రామస్తులు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్థానిక మల్లికార్జున స్వామి ఆలయం నుంచి అమ్మవారి అభిషేకం కోసం తీసుకొచ్చిన తుంగభద్ర నది జలాన్ని జ్యోతులలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ పురువీధుల మీదుగా ఊరేగించారు. చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం తుంగా జలంతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. శనివారం జరిగే జ్యోతి ఉత్సవాలతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ అధ్యక్షుడు మఠం రామాంజనేయులు తెలిపారు.

ఆర్థిక సాయం

ఆదోనిరూరల్: మండలంలోని దొడ్డనకేరి గ్రామానికి చెందిన మునిస్వామి ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. తనకు సాయం అందించాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని స్వగృహంలో శుక్రవారం సంప్రదించగా, వెంటనే ఎమ్మెల్యే రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న లక్ష్మీరెడ్డి

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ విద్యార్థులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.. పాఠశాలలో చదువుతున్న షేక్షావలి, మారెప్ప ఇటీవల హర్యానాలో జరిగిన డాగ్జిబాల్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే ఈ ఏడాది రెండుసార్లు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న షబానాబేగంకు అందజేసి అభినందించారు. కౌతాళంకు చెందిన మహాలక్ష్మి సేవావజ్రా అవార్డు పొందడంతో ఆమెను సన్మానించారు.

విధులకు రారు.. పనులు చేయరు



కుంబళనూరులో తాళంవేసి ఉన్న సచివాలయం

కౌతాళం: కుంబళనూరు సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో సర్టిఫికెట్ల జారీ, ప్రభుత్వ సేవల్లో జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు వాపోయారు. మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపులోని సచివాలయం శుక్రవారం 12 గంటలైనా తెరవకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన లబ్ధిదారులు వెనుదిరిగారు. సచివాలయంలో కార్యదర్శి, వీఆర్‌ఓ, మహిళా పోలీస్, అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌లు ఉన్నా కార్యదర్శి, వీఆర్‌ఓలకు మూడు, నాలుగు గ్రామాల ఇన్‌చార్జిలు ఉండడంతో వారు సచివాలయానికి వారంలో ఒకటి రెండు సార్లు వస్తున్నారు. మిగిలిన సిబ్బంది సచివాలయంలోనే ఉండలన్న నిబంధన ఉన్నా సక్రమంగా రావడం లేదు.

ఘనంగా ఉరుసు

కృష్ణగిరి: చిట్యాల గ్రామంలో వెలసిన లాలాస్వామి ఉరుసు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉరుసు సందర్భంగా గ్రామం బంధువులతో కళకళలాడుతోంది. ఉదయం నుంచే గ్రామస్తులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధం కార్యక్రమం రాత్రి 11 గంటలకు ప్రారంభించి గ్రామ పురవీధుల గుండా ఆశ్వంపై ఊరేగించి శనివారం ఉదయం 8 గంటలకు స్వామికి సమర్పించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇందిరానగర్‌లో అభివృద్ధి పరుగులు

- రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు
- 19 వార్డులో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- సంక్షేమ పథకాల ద్వారా కాలనీవాసులకు రూ.14కోట్ల మేర లబ్ధి
- పరోక్షంగా మరో రూ.7.6 కోట్ల ప్రయోజనం



మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్‌కు సీసీ రోడ్డు వేసిన దృశ్యం



ఇందిరానగర్-లక్ష్మమ్మవ్వ నగర్ మధ్యలో వేసిన బీటీ రోడ్డు



లక్ష్మమ్మవ్వనగర్‌లో గ్రావెల్ రోడ్డు, మురుగు కాలువలు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోనిటౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌ను ఒకప్పుడు దళితవాడగా చూసేవారు. గత పాలకులు పట్టించుకోకపోవడంతో కాలనీలో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో స్థానికులు తమ బతుకులింతేననుకుంటూ జీవనం సాగించారు. అయితే జగనన్న ప్రభుత్వం పేదల కాలనీలను అభివృద్ధి పథంలో పయనించేలా చర్యలు చేపట్టడంతో ఇందిరానగర్‌లో దాదాపు రూ.2.50 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పట్టణంలో అభివృద్ధి పనుల్లో దూసుకెళ్తోంది. నాడు మట్టి రోడ్లు కూడా సరిగా లేని ప్రాంతంలో సీసీ రోడ్లు వేయించారు. ఇళ్ల మధ్యనే నిల్వ ఉండిపోయే మురుగునీటి ఇబ్బందులు లేకుండా ముగురు కాల్వలు నిర్మించారు. వీధి దీపాలు, శిథిలమైన స్తంభాల స్థానంలో కొత్తవాటిని వేశారు. దీంతో ఆ వాడ కొత్త కాలనీగా దర్శనమిస్తోంది. లక్ష్మమ్మవ్వ నగర్, ఇందిరానగర్ ప్రాంతాలను కలుపి వార్డు సచివాలయం ఏర్పాటు చేయడంతో ప్రజా సమస్యలు స్థానికంగా పరిష్కారవుతుండటంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వార్డు వివరాలు..

జనాభా - 5,600

పురుషులు - 2,750

మహిళలు - 2,850

పింఛన్‌దారుల సంఖ్య - 550

కాలనీలు - ఇందిరానగర్, ఎరుకల కాలనీ, లక్ష్మమ్మవ్వనగర్, టీచర్స్ కాలనీ.

అభివృద్ధి పనులు ఇలా..



- ఇందిరానగర్ నుంచి టీచర్స్ కాలనీ వరకు మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.50 లక్షలతో బీటీ రోడ్డు, కాలువల ఏర్పాటు.
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.70 లక్షలతో లక్ష్మమ్మవ్వ నగర్‌లో బీటీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు వేశారు.
- లక్ష్మమ్మవ్వనగర్ శివారులో రూ.6 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు
- గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో లక్ష్మమ్మవ్వనగర్‌లో బీటీ రోడ్డు, కాలువల ఏర్పాటు
- అమృత్ పథకం కింద రూ.33 లక్షలతో పార్కు అభివృద్ధి
- రూ.40 లక్షలతో ఇందిరానగర్‌లోని ఆంజనేయస్వామి గుడి దగ్గర సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం
- ఎరుకల కాలనీలో రూ.14 లక్షలతో బీటీ రోడ్డు
- రూ.11 లక్షలతో నాయీబ్రాహ్మణవీధిలో ఆంజనేయస్వామి గుడి వద్ద బీటీ రోడ్డు నిర్మాణం
- ఉప్పరిగేరి, వెంకటేశ్వరస్వామి గుడి వద్ద రూ.2 లక్షలతో బోరు వేసి మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు.
- ఉప్పారిగేరిలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, 20 కొత్త విద్యుత్ స్తంభాలు వేశారు.

సంక్షేమ పథకాల లబ్ధి..

- ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం రూ.14,06,52,605

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.లలో)
జగనన్న అమ్మఒడి	498	2,18,12,500
జగనన్న విద్యాదీవెన	288	91,90,295
జగనన్న వసతిదీవెన	242	38,62,126
వైఎస్సార్ రైతుభరోసా	279	1,30,62,650
డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా	201	41,48,583
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాల రైతులు	45	1,43,249
రైతులకుఇన్‌పుట్‌సబ్సిడీ	17	1,86,350
వైఎస్సార్ పెన్షన్‌కానుక	527	4,83,7,500
వైఎస్సార్‌చేయూత	234	1,04,62,500
వైఎస్సార్ ఆసరా	386	68,80,309
వైఎస్సార్ సున్నావడ్డీ	594	14,49,480
వైఎస్సార్ కాపు నేస్తం	21	78,0000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	19	5,55,000
వైఎస్సార్‌కళ్యాణమస్తు/ షాదీతోఫా	01	1,00,000
డా.వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ	130	57,58,015
ఆరోగ్య ఆసరా	90	6,08,600
హౌసింగ్	139	92,39,686
వైఎస్సార్ బీమా	11	1,29,0000
వైఎస్సార్‌వాహనమిత్ర	23	7,10,000
జగనన్నచేదోడు	52	11,50,000
వైట్ కార్డు హోల్డర్‌లకు ప్రత్యేక కోవిడ్ సహాయం	939	9,39,000
జగనన్న తోడు (వడ్డీ)	57	16762
నాన్ డీబీటీ మొత్తం :		రూ.7,60,29,842
ఇంటి స్థలాలు	150	3,69,00,000
జగనన్నవిద్యాకానుక	187	13,28,074
ట్యాబ్‌ల పంపిణీ	32	4,23,104
జగనన్నతోడు (రుణాలు)	140	26,06,660
గోరుముద్ద	176	17,43,632
వైఎస్సార్‌సంపూర్ణపోషణ	512	95,89,760
ఇంటింటికిరేషన్	1,073	2,34,38,612
డీబీటీ, నాన్ డీబీటీ మొత్తం : రూ.21,66,82,447		

ఇంటి ముందు సీసీ రోడ్డు వేశారు



గతంలో మట్టి రోడ్డు ఉండేది. దీంతో చాలా ఇబ్బందిగా ఉండేది. సీసీ రోడ్డు వేయడంతో ఇబ్బందుల తప్పాయి. ప్రస్తుతం కాలనీలో ఎలాంటి అపరిశుభ్రత లేదు. రాకపోకలకు చాలా సౌకర్యంగా ఉంది. - లక్ష్మన్న, మహాయోగిలక్ష్మమ్మవ్వనగర్

జగనన్న పాలనలోనే అభివృద్ధి జరిగింది



మా ఏరియాలో జగనన్న పాలనలోనే అభివృద్ధి జరిగింది. కాలనీ చుట్టూ మట్టి రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కాలువలు వేశారు. కొన్ని సందుల్లో రోడ్లు వేయాల్సి ఉంది. వాటిని కూడా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరుకాగానే వేస్తామని చెప్పారు. కాలువలు, రోడ్లు, తాగునీటివసతి, వీధి దీపాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. - కృష్ణ, మహాయోగి లక్ష్మమ్మవ్వ నగర్)

రూ.2.50 కోట్లతో పనులు చేశాం



57 నెలల జగనన్న పాలనలో 19వ వార్డును ఎంతో అభివృద్ధి చేశాం. మునుపెన్నడూ లేనివిధంగా ప్రతి వీధిలో రోడ్లు, కాలువలు నిర్మించాం. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహాయ సహకారాలతో కాలనీలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. టీడీపీ పాలనలో ఐదేళ్లు గడిచినా వార్డుల అభివృద్ధికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు మించి కేటాయించలేదు. ప్రస్తుతం కేవలం ఇందిరానగర్‌కు మాత్రమే రూ.2.50 కోట్లు వెచ్చించడం సంతోషంగా ఉంది. - బి.చలపతి, 19వ వార్డు కౌన్సిలర్

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 33వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ కిశోర్ ఆధ్వర్యంలో 40 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమకు ఇంటి పట్టా మంజూరు కాలేదని ఎవరూ అధైర్యపడవద్దని అందరికీ మంజూరు చేస్తామని చెప్పారు. 33 పథకాల ద్వారా నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్లు, స్థలాలు మంజూరు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న మళ్లీ సీఎంగా గెలిపించుకుంటే ఇంతకంటే మెరుగైన సంక్షేమం పొందవచ్చన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



మంత్రాలయంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందజేస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సంతమార్కెట్ ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శాలువా, పూల మాలలు వేసి సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్ర చరిత్రలోనే నిలిచిపోతాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే వలంటీర్లు ఇంటి తలుపు తట్టి అవ్వ తాతలకు పింఛన్ అందిస్తున్నారని తెలిపారు. అర్హత ఉంటే చాలు కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. గత చంద్రబాబు పరిపాలనలో అవ్వాతా త పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అవస్థలు పడే దుస్థితి ఉండేదన్నారు. అలాంటి పరిస్థితి లేకుండా చేశారని ప్రజలందరూ జగనన్న పరిపాల ను స్వాగతిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, ఎస్‌ఐ గోపినాథ్, సర్పంచ్ తెల్ల బండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర ఆచారి, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ కీలకం





సరస్వతి పూజలో ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, అధ్యాపక బృందం, స్కౌట్ అండ్ గైడ్‌కు ఎంపికైన విద్యార్థినులు

కోసిగి: విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ చదువు చాలా కీలకమని, కష్టపడి చదివితే జీవితంతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సమీరారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులతో సరస్వతి పూజ నిర్వహించారు. సెంకడియర్ విద్యార్థులకు వడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయని తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఫస్ట్ ఇయర్‌లో 62 మంది, సెకెండియర్‌లో 39 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షల్లో టెన్షన్ పడకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మీని సన్మానించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు విద్యార్థినులు ఎంపిక

ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న 32 మంది విద్యార్థినులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ సమీరారెడ్డి తెలిపారు. జిల్లాలోనే కోసిగి ఏపీ మోడల్ స్కూల్ నుంచి విద్యార్థినులను ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. గౌడ్‌గా ఉన్న జి.రాజేశ్వరి, ఎంపికకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. అధ్యాపకులు మోహన్‌బాబు, మధుబాబు, రంగనాథ్ బాబు, సుందరకుమార్, ఉషారాణి, లక్ష్మీ, హిమబిందు, సాయి కుమారి, రమణ పాల్గొన్నారు.

భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కండి

కృష్ణగిరి: ప్రతి విద్యార్థి భయం వీడి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొంటే విజయం వరిస్తుందని జీసీడీఓ సునీత సూచించారు. కృష్ణగిరిలోని కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఇంటర్, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితం వస్తుందన్నారు. ఉన్న సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు చదవడం, రాయడం కంటే బృందంగా కూర్చొని చర్చించుకుంటే ఎక్కువగా జ్ఞాపకం ఉంటుందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం భోజన శాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, రాధమ్మ పాల్గొన్నారు.

పాము కాటుతో వలసకూలి మృతి



మృతి చెందిన బంగారప్ప (ఫైల్)

పెద్దకడబూరు: పాము కాటుతో వలసకూలి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బంగారప్ప(32) భార్య, పిల్లలతో గత నెలలో గుంటూరు జిల్లాకు మిరుపపంట కోయడానికి వలస వెళ్లాడు. ఈ నెల 16వ తేదీ మిరుపకాయలు కోస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. సత్తనపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స తీసుకుని తాను నివాసం ఉన్న చోటుకు వెళ్లిపోయాడు. 19వ తేదీ బంగారప్ప చెవి, ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో భార్య హనుమంతమ్మ భయపడి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేసింది. సొంత గ్రామానికి రావాలని కుటుంబసభ్యులు తెలపడంతో వెంటనే బయలుదేరారు. 20వ తేదీ ఆదోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. మృతుడికి కుమార్తెలు(12), (1.5), కుమారుడు (10) ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

25న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదోనిసెంట్రల్: ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు ఆదోనిలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ ఎంపిక పోటీల ను నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కబడ్డీ అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి సుభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ పోటీ లు నెల్లూరులో మార్చి 8 నుంచి 10వ తేదీ వర కు జరుగుతాయని చెప్పారు. పురుషులు 85 కేజీల లోపు బరువు ఉండాలని, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. వివరాలకు సెల్ 9701012329 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు పవమాన హోమం

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం శ్రీ పవమాన హోమ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు సన్నిధిలో కేవలం దంపతులకు మాత్రమే పవమాన హోమ పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముందుగా ఆంజనేయస్వామికి తేనాభిషేకం, విశేష ఫల పంచామృతాభిషేకం, అలంకారం, నైవేద్యం, మహామంగళహారతి పూజలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని జి.హొసల్లి గ్రామం వద్ద శుక్రవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన గుగ్గుల కురువ ఆదికేశవరెడ్డి, కురువ హనుమంతును అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య తెలిపారు. నిందితులు మోటార్ సైకిల్‌పై మద్యం తరలిస్తుండగా దాడులు చేసి అదుపులోకి తీసుకొని వారి నుంచి మోటార్ సైకిల్, 480 టెట్రా ప్యాకెట్లు (5 బాక్సులు)ను సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

విజయవంతం చేద్దాం

ఆదోనిరూరల్: పట్టణంలో నిర్వహించనున్న ఎస్సీ ఆత్మీయ సమ్మేళన పునరంకిత సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, జిల్లా కార్యదర్శి తాయప్ప, ఆదోని మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాసు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బాబాగార్డెన్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని, అప్పుడే మన అభ్యున్నతి సాధ్యమన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రణాళికను సిద్ధం చేసేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామన్నారు. కౌన్సిలర్లు చలపతి, చిన్నా, మాజీ సర్పంచులు రాజు, నరసింహులు, ప్రభాకర్, నాయకులు విశ్వనాథ్, లక్ష్మన్న, బొబ్బిలి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవితం



ప్రసంగిస్తున్న సిద్ధరూఢ మహాస్వామి



ఉపన్యాసానికి హాజరైన భక్తులు

కోసిగి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకుని ప్రశాంత జీవితం గడపాలని సద్గురు ఆరూఢజ్యోతి శ్రీషణ్ముఖరూఢ మఠం పీఠాధిపతులు సిద్ధరూఢ మహాస్వామి, కరిబసవరాజేంద్ర మహాస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శ్రీసిద్ధరూఢ స్వామి అష్టమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఫల, పుష్పాలు సమర్పించి విశేష పూజలు చేశారు. ఉదయ 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మహాస్వాములతో సిద్ధరూఢ స్వామి విశిష్టతను భక్తులకు వివరించారు. ఉపన్యాసానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్రం బీజాపురం శ్రీషణ్ముఖరూఢ మఠం పీఠాధిపతులు సిద్ధరూఢ మహాస్వామి, ఉరవకొండ శ్రీగవిమఠ సంస్థాన పీఠాధిపతి శ్రీకరిబసవరాజేంద్ర మహాస్వామి, సద్గురు శివానంద స్వామి, సద్గురు ప్రణావనందస్వామి పూజలు చేసుకున్నారు. అనంతరం భక్తులకు సందేశం ఇచ్చారు. శనివారం స్వామి మహారథోత్సవం, పల్లకోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.